# లివింగ్ టుగెదర్

## డి. కామేశ్వరి

అలవాటుగా కెనటిక్ హోండా పూలమ్మి గంప దగ్గిర ఆగింది. అంతలోనే, పూలెందుకు గౌతమ్ వూర్లో లేడుగా అన్పించి స్కూటర్ స్టార్ట్ చెయ్యబోతూ పూలమ్మి కళ్ళల్లో నిరాశచూసి గౌతమ్ లేకపోతే పూలు పెట్టుకోకూడదా? పెట్టుకోకపోయినా ప్లేట్‌లో పోసి డ్రాయింగ్ రూంలో పెడితే చక్కగా యిల్లంతా సువాసన పరుచుకుంటుంది. మూర పూలు కొని స్కూటర్ స్టార్ట్ చేసింది చిత్ర.

మగరాయుడిలా క్రాపు చేయించుకు తిరిగే తాను యిప్పుడు జుత్తు పెంచి రెండు అల్లికలు అల్లి రబ్బరు బ్యాండు కట్టి సన్నజాజులు, మల్లెలు తురుముకోడం... తనకే ఆశ్చర్యం అనిపిస్తుంది చిత్రకి. ఎంత మార్పు వచ్చింది గౌతమ్‌తో సహచర్యం ఆరంభించాక. చిన్నప్పుడు తల్లి రెండు జడలు వేసి పూలు పెడితే పీకేసేది. చేతికి గాజులు వేయించుకునేది కాదు. గౌను తొడిగితే అన్నయ్యలా పేంటు, షర్టు కావాలని ఏడిచేది. ఆడపిల్ల లక్షణాలు లేవే నీకు మగరాయుడివి అనేది తల్లి. ఇంజనీరింగు చదువుతూండగా ఓనాడు జుత్తంతా కత్తిరించుకుని క్రాపు చేయించుకుని యింటికి రాగానే తల్లి లబోదిబో అంది. తండ్రి చాలా విముఖతతో మొహం చిట్లించాడు. అలాంటి తను గౌతమ్ అన్నాడని 'పూలెందుకు పెట్టుకోవు, సన్నజాజులు, మల్లెలు మంచి రొమాంటిక్ ఫీలింగిస్తాయి' అన్నాడని, అతని కోసం జుత్తు పెంచి పూలు పెట్టుకోవడం మొదలుపెట్టింది. అదిప్పుడు అలవాటుగా మారింది.

హోండా పార్క్ చేసి అపార్ట్‌మెంట్ తలుపు తీస్తుంటే గౌతమ్ వూర్లో లేడన్న భావం ఏదో రిలీఫ్‌నే యిచ్చింది. అతనొస్తాడని గబగబ అలుపైనా తీర్చుకోకుండా ఫ్రెష్ అయి తయారవక్కర్లేదు. అతను లేడు గనక ఏం వండాలి, అతనికేం యిష్టం అన్న ఆలోచనక్కర్లేదు. నిన్న సాయంత్రం వండిన వంట అతను తినకుండానే తండ్రికి హార్ట్ అటాక్ వచ్చిందని ఆఫీసుకి ఫోనొచ్చిందని హడావిడిగా ట్రావెలేజంటుతో టిక్కెట్టు తెప్పించుకుని బోంబే ఎక్స్‌ప్రెస్‌లో పూనా వెళ్ళిపోయాడు. ఫ్రిజ్‌లో వున్నది తను తినేయచ్చు - వంటక్కర్లేదు - తొందరగా పడుకుండిపోవచ్చు. బద్ధకంగా దివాన్ మీదకి హ్యాండ్‌బ్యాగ్, చున్ని విసిరేసి ఫ్రిజ్ లోంచి ఫాంటా గ్లాసులో వంపుకుని సిప్‌చేస్తూ టి.వి. ఆన్ చేసింది - సాయంత్రం ఏం మంచి ప్రోగ్రాంలు వుండవు. విసుగ్గా టి.వి. ఆపేసి దివాన్ మీద తలగడలు అమర్చుకుని వాలింది.

గౌతమ్ వుంటే ఎంత తేడా? అతనొచ్చే లోపల గబగబ వంటచేసి, స్నానించి, మంచి చీర కట్టుకుని, సన్నజాజి పూలు పెట్టుకుని వంటంతా డైనింగ్ టేబిల్ మీద సర్దేసేది. యింట్లో వున్నన్ని రోజులు యిటు పుల్లతీసి అటు ఎప్పుడూ పెట్టలేదు. తాగిన గ్లాసు, కప్పు కూడా ఎక్కడివక్కడ అలాగే వదిలేసేది. తల్లి కేకలేస్తే నిర్లక్ష్యంగా దులుపుకుని వెళ్ళిపోయేది. వంటింటి పని బోరు - తినడం, చదువు, ఫ్రెండ్స్‌తో తిరగడం, సినిమాలు, షికార్లు ఎంత కేర్ ఫ్రీగా తిరిగేది. రేపు పెళ్ళయి ఎలా కాపురం చేస్తుందో అనేది తల్లి కోపంగా. 'అందుకేగా పెళ్ళి వద్దంటున్నా, యిల్లు, వంట, పిల్లలు బోర్, పెళ్ళివాడికి కావాలి, పొగరుగా అనేది.

ఇంజనీరింగు అయిందగ్గిర నుంచి పెళ్ళి పెళ్ళి అన్నగోల - తనకి ఎవరూ సంబంధాలు చూడక్కర్లేదని, అలా పది నిమిషాలు చూసి పెళ్ళి చేసుకోనని, వీళ్ళని, వాళ్ళని పిలిచి పెళ్ళి చూపులకి కూర్చోమంటే కూర్చోనని తనకి ఎవరన్నా కలిసి నచ్చితే, మనసులు కలిస్తే, ఎలాంటివాడో స్టడీచేసి గాని పెళ్ళిచేసుకోను అని ఖచ్చితంగా చెప్పేసింది. చెప్పి చెప్పి విసిగి పూరుకున్నారు. ఎవరెలాంటివారో నీవు ఆర్నెల్లో ఏడాదో స్నేహం చేసినా, తిరిగినా అర్థం కాదు. ఆ మూడు ముళ్ళు పడి కాపురం పెడితేగాని అసలు రంగులు బయటపడవు. పెళ్ళయ్యే వరకు అంతా మంచివారే. పెళ్ళాం కానంత వరకు ప్రతి మగాడు ఆడపిల్లని ఇంప్రెస్ చేయడానికి, చక్కగా వుండేందుకే ప్రయత్నిస్తాడు. పెళ్ళి కాకుండా మగాడితో తిరిగి యిష్టమై నచ్చితే చేసుకుంటాను. లేకపోతే లేదు అని ఎక్స్‌పెర్మెంట్లు చేయడానికి విదేశాలు కావివి. ఆ తరువాత నీవు కావాలన్నా ఎవడూ చేసుకోడు అనేది తల్లి. నచ్చచెప్పలేని నిస్సహాయతతో కోపం తెచ్చుకుని.

'పోనీలే, ఎవడూ చేసుకోకపోతే, అలా యిష్టపడి చేసుకునే వాడు దొరక్కపోతే అలాగే వుండిపోతా, పెళ్ళి కాకపోతే కొంపమునగదులే'. ఉడుకు రక్తం వేడిలో వాదనకి దిగేది. తల్లి తనతో వాదించలేక విరక్తిగా వెళ్ళిపోయేది. ఆఖరికి తల్లి తండ్రి తనతో వేగలేక 'నీ యిష్టం వచ్చిన వాడినే చేసుకో, ఆ చూసుకోడం, చేసుకోడం ఏదో త్వరగా చెయ్యి. పాతికేళ్ళు నిండకుండా చేసుకో, ఏ వయసుకా ముచ్చట. ఆలస్యం అయితే అన్నీ ప్రాబ్లమ్సే.

'నచ్చినవాడు దొరికితే చెప్తాలెండి' నిర్లక్ష్యంగా అనేది.

వైజాగ్‌లో గీతంలో కంప్యూటర్ యింజనీరింగు అయ్యాక మంచి జీతంతో హైదరాబాదులో 'ఇంటెలి' కంపెనీలో ఉద్యోగం వచ్చింది, వుమెన్స్ హాస్టల్లో వుండేది. ఉద్యోగంలో చేరిన ఆరు నెలలకి నచ్చినవాడు, మెచ్చినవాడు దొరికాడు!


ఏదో ప్రాజెక్ట్ వర్క్ కోసం బొంబాయినించి వచ్చిన గౌతమ్‌తో పరిచయం - యిద్దరూ కల్సి చేయాల్సిన ఆ ప్రాజెక్ట్ వర్క్ రెండు నెలల్లో పరిచయం స్నేహంగా మారింది. అతని ఐ.ఐ.టి. తెలివి, కార్యదక్షత, ఆకర్షించగలిగే అతని హావభావాలు, మాటలు, అతని సెన్సాఫ్ హ్యూమర్, యిద్దరివి ఒకటయిన అభిరుచులు. యివన్నీ అతని పట్ల ఆకర్షణని పెంచాయి. దగ్గిరయ్యారు. మనసులు కలిశాయి. హోటలు డిన్నర్లు, షికార్లు, సినిమాలు, లేట్ నైట్ ధాబా డిన్నరులు... ఈలోగా అతని బొంబాయి ఆఫీసు అతన్ని హైదరాబాదు బ్రాంచి వర్క్ చూడమని ట్రాన్స్‌ఫర్ చేసి తామిద్దరూ మరింత దగ్గర కావడానికి దోహదం చేసింది. గౌతమ్‌తో విహారాలకి అడ్డు వస్తూందని వుమెన్స్ హాస్టల్ వదిలి సింగిల్ బెడ్‌రూమ్ యిల్లు అద్దెకు తీసుకుంది. స్వేచ్ఛ ఎక్కువయి దగ్గిరతనం యింకా ఎక్కువయింది. సాయంత్రాలు వచ్చిపోవడం, యింట్లో యిద్దరూ సరదాగా వండుకు తినడం... అపుడపుడు రాత్రి కబుర్లు చెప్పుకుంటూ వుండిపోయేవరకు యిద్దరి సాన్నిహిత్యం చేరింది. అంతవరకు స్నేహితుడితో రూము షేరు చేసుకున్న గౌతమ్ డైరక్టుగా తన యింటికి మకాం మార్చేశాడు. 'లివింగ్ టుగెదర్' కాన్సెప్ట్ మొదలైంది.

ఓ ఆరు నెలలు యిద్దరికిద్దరు చుట్టూ ప్రపంచం వుందన్న విషయం మర్చిపోయేంతగా ప్రేమానురక్తిలతో మునిగితేలారు. సంఘం, లోకులు అన్న పదాలనేవి వుంటాయని తెలియనట్టు, నియమాలు, కట్టుబాట్లులేని విచ్చలవిడితనం, అదో రకం ధైర్యం, తెగువ నిచ్చింది ఆ ప్రేమ మైకం. ఓహ్! ఏం రోజులవి! ఏం రాత్రులవి! ఎన్ని వెన్నెల రాత్రులు బాల్కనీలో వెన్నెల నీడలో పరుపేసుకుని, పక్కమీద మల్లెలు జల్లుకుని, అగరొత్తులు వెలిగించి, పక్కన టేప్ రికార్డరు మంద్రస్థాయిలో గజల్స్ వినిపిస్తుంటే ఒకరి చేతుల్లో ఒకరు ఒదిగి విని మైమరచి, శారీరక కోరికని మించిన ఓ రసానుభూతి యిరువురిని ప్రేమానుభూతి వశం చేసుకుని - అది చాలా సహజంగా, శారీరకంగా మారి... అనిర్వచనీయ భావోద్వేగం చుట్టుముట్టి... అతను అలసి సోలిపోతే పమిట చెంగుతో అతని చెమట తుడిచి, ప్రేమగా పసివాడిలా అక్కున చేర్చుకుని తను - చెమటతో తడిసిన తన ముంగురులు సవరిస్తూ అతను. స్త్రీ పురుషుల మధ్య ప్రేమ వుంటే సెక్స్ కేవలం వాంఛగా కాక ఓ అపురూప అనుభూతినిస్తుందన్న సత్యం తెలుసుకున్న వైనం... 'నైట్ గౌనొద్దు వళ్ళంతా బురఖా వేసుకున్నట్టు ఏం బాగుంటుంది. చీరలో వున్న శృంగారం దేన్లో వుంటుంది, చీరకి, జాకెట్టుకి మధ్య వున్న నడుం వంపు మగాళ్ళని ఎంత కవ్విస్తుందో మీకేం తెలుసు అంటూ ఆ ఖాళీ జాగాలో పియానో వాయించినట్లు అతని వేళ్ళ కదలికలు తనలో ఎన్ని ప్రకంపనాలు కల్గించేవో, కురులు విరబోసి

నక్షత్రాలలాగా అక్కడక్కడ మల్లెలు అమర్చి నీలాకాశంలో తారలనడం - పాతకాలంలో శోభనం గదిలో మిఠాయిలు ఎందుకు పెడతారో అర్థమయినట్టు - అర్ధరాత్రి అల్సిపోయాను ఆకలేస్తూంది తినడానికేమన్నా వుందా అని పసిపిల్లాడిలా అడిగితే మొదటిసారి యిల్లంతా వెతికి బిస్కట్టు పేకెట్టు తెచ్చుకుని యిద్దరూ తినడం, అప్పటి నించి ఏదో ఒక స్వీటు ఫ్రిజ్‌లో ఎప్పుడూ వుంచేది - ఎండాకాలం అయితే ఐస్‌క్రీమ్ - అర్ధరాత్రి అవి తింటూ ఎడతెగని కబుర్లు చెప్పుకుంటూ ఏ రెండు మూడు గంటలకి ఒకరి చేతుల్లో ఒకరు నిద్రపోవడం, తెల్లారి కళ్ళు విడక పాలవాడు, పనిమనిషి తట్టే బెల్లు మోతలకి లేవక తప్పక లేచి ఎర్రబడ్డ కళ్ళతో ఆదరాబాదరా తయారై ఇన్ని పాలుపోసుకుని కారన్ ఫ్లేక్స్ లేక రెండు బ్రెడ్ ముక్కలు నోట్లో కుక్కుకుని ఆఫీసుకి పరిగెత్తడం, నిద్రలేమితో బద్ధకంగా, నిస్తేజంగా తప్పని డ్యూటీ చేయడం మళ్ళీ యింటికొచ్చి అతనొచ్చేలోగా జిడ్డుమొహం, అతనికి కనపడరాదని ఫ్రెష్‌గా ఉడుకులాం నీళ్ళలో వేసుకుని స్నానించి చక్కటి పల్చటి కోటా చీర కట్టుకుని, జాజులు తురుముకుని, టీ పెడ్తుండగా అతనొస్తే యిద్దరూ కల్సి బాల్కనీలో ఆరోజు ఆఫీసు ముచ్చట్లు చర్చించుకుంటూ టీ తాగడం - తరువాత యిద్దరూ కల్సి సరదాగా వంట చేసుకోడం - అతను కూరలు తరుగుతూంటే - తను కుక్కరు పెట్టేది - తను పోపులు వేస్తుంటే అతను టేబిల్ సర్దడం - వంటలో ఓనమాలు రాని తను అతని కోసం ఆఫీసులో పెళ్ళయిన కొలీగ్స్ నడిగి అతనికిష్టమైనవి చేసి పెట్టాలని తాపత్రయపడడం, వంటల పుస్తకం కొని వచ్చీ రాని వంటలు చేస్తూ నీరు కారే వంట జోకులేసుకుంటూ తినడం 'తినడం ప్రాధాన్యం కాదు, చేసి మెప్పించాలనే మనసు ముఖ్యం. అనే గౌతమ్ పెద్దమనసుని చూసి మురిసిపోవడం, అలా అనే అతన్ని మెప్పించాలని వంట నేర్చుకుని మూడు నెలల్లో ప్రావీణ్యం సంపాదించడం - వంట బోర్ అనే తను ఎంత మారింది! యింట్లో చిన్న మాట ఎవరన్నా అంటే పౌరుషంతో ఎగిరే తను గౌతమ్ యిన్‌ఫ్లూయన్స్‌తో ఎంత మైల్డ్‌గా, మెచ్యూర్డ్‌గా మారింది. ఏదన్నా విషయం సీరియస్‌గా తీసుకుని వెంటనే రియాక్ట్ కాకుండా చల్లబడ్డాక ఆలోచించాలని ఎన్నెన్ని విషయాలు చెప్పి వప్పించి క్రమంగా తనలో మార్పు తెచ్చాడు. సెన్సాఫ్ హ్యూమర్ అంటే ఏమిటో అతని దగ్గిరే తెల్సుకుంది. తన అదృష్టం కొద్ది గౌతమ్ లాంటి యింటలెక్చువల్ సహచర్యం దొరికిందని పొంగిపోయింది. టోటల్‌గా సరెండర్ అయిపోయింది. కట్టుకున్న భార్య కన్న మిన్నగా అతని బట్టలు కూడా ఉతకడానికి చిన్నపాటి అభ్యంతరం లేకుండా చేసేది. గౌతమ్‌ని ఎలా మెప్పించడమా అన్నదే ధ్యేయం అన్నట్లుండేది.

✦✧✦

అలాంటి రోజుల్లో ఓ రోజు తెల్లారి ఏడుగంటలకి అపుడే లేచి బద్ధకంగా నైట్ డ్రస్సులలో కాఫీలు తాగుతూ పేపర్లు చదువుతూంటే డోర్‌బెల్ వినిపించి పనిమనిషనుకుని 'తీసే వుంది' అంది చిత్ర బద్ధకంగా. తలుపు తీసుకువచ్చిన యిద్దరిని చూసి బద్ధకం ఎగిరిపోయి ఒక్క ఉదుటున లేచి నిలబడ్డారిద్దరూ. 'మీరా' అని మాత్రం అనగల్గింది. షర్టులేకుండా ఉత్తి పైజమాతో వున్న గౌతమ్ గాభరాగా లేచి బెడ్‌రూంలోకి వెళ్ళి షర్ట్ వేసుకొచ్చి ఒక్క క్షణం సందిగ్ధంగా నిలబడి 'వస్తా, యిపుడే వస్తా' అంటూ చెప్పులేసుకు బైటికి వెళ్ళిపోయాడు.



తెల్లమొహంతో నిలబడ్డ చిత్రని అనుమానంగా, తీక్షణంగా చూస్తూ 'ఎవరతను?' అంది సావిత్రి. చిత్ర కాస్త తడబడి, మా ఫ్రెండ్, కొలీగ్' అంది అప్పటికి కాస్త కూడదీసుకుని. ఏమిటిలా చెప్పాపెట్టకుండా హఠాత్తుగా వచ్చారు? తల్లిచేతిలో షోల్డర్ బ్యాగు అందుకుంటూ బెడ్‌రూములో పెట్టి వచ్చి స్టౌమీద నీళ్ళు పెట్టింది - 'మొహాలు కడుక్కున్నారా, కాఫీ యివ్వనా' మామూలుగా అంది. "కాఫీ సరే అతనెవరు?" రెట్టించింది సావిత్రి. ఈసారి కాస్త నిలదొక్కుకుని నిర్లక్ష్యంగా చూస్తూ 'చెప్పాగా, మా కొలీగ్ అని' 'యిక్కడే వుంటాడా ఆ కొలీగ్, యీ యింట్లోనే వుంటాడా?' శ్రీహరి కళ్ళు తీక్షణంగా వున్నా మాట వ్యంగ్యంగా వుంది.

'నీవిక్కడ వెలగబెడ్తున్న వ్యవహారం తెల్సి వచ్చాం. విన్నది అబద్ధం కాదని చూడగానే తెల్సింది.' సావిత్రి తీక్షణంగా అంది. చిత్ర జవాబివ్వలేదు. మీ మామయ్య కృష్ణ ఆఫీసు పనిమీద యీ వూరొచ్చి నిన్ను చూద్దామని వుమెన్స్ హాస్టలుకి వెడితే నీవక్కడ లేవని, మారిపోయావని, మీ అపార్ట్‌మెంట్ అడ్రస్ యిచ్చారుట. యిక్కడికి వస్తే నీ వింట్లో లేవుట - నీవు, ఎవరో మగ అబ్బాయి కలిసి వుంటారని, మొదట పెళ్ళికాలేదంది - ఆ అబ్బాయి మొదట్లో వచ్చిపోయేవాడు, ఇప్పుడు ఏకంగా

యింట్లో వుంటున్నాడు అని బిల్డింగ్ సెక్రటరీ చెప్పాడట- 'ఇదేం పద్ధతండి' పెళ్ళి కావల్సిన పిల్ల, మర్యాదస్తులుండే అపార్ట్‌మెంట్స్, మాకూ ఆడపిల్లలున్నారు మీరు చూస్తే అయినింటి వాళ్ళలా వున్నారు. మీ అమ్మాయికి చెప్పండి, లేదంటే మేమే యింటి ఓనర్స్‌కి కంప్లయింట్ యివ్వాలనుకుంటున్నాం' అన్నాడుట అమర్యాదగా.

'ఛా, ఛా... చదివించి ఉద్యోగం చేసుకోమంటే యింత బరితెగింపా? యిదేం ఫారెననుకుంటున్నావా? లివింగ్ టు గెదర్లు చేస్తుంటే చుట్టూ జనం వూరుకోడానికి, మీ మామయ్య చెప్తుంటే తల ఎత్తుకోలేకపోయాం - ఎవరన్నా ఏమనుకుంటారన్న భయమన్నా లేకుండా యింత తెగింపా' - శ్రీహరి మొహం కోపం... అవమానంతో ఎర్రబడింది.

'చేసిన ఘనకార్యం చాలు, జరిగిందేదో జరిగింది. యిప్పటికయినా పెళ్ళి చేసుకోండి ఆర్నెల్లు కలిసి వున్నారుగా, యిద్దరికి ఒకరి గురించి ఒకరికి తెల్సిందిగా యింక చేసుకోవచ్చుగా' సావిత్రి రాజీ ధోరణిలో అంది.

'ఏమో యింకా ఆ విషయం నేనాలోచించలేదు. మేం యిద్దరం పెళ్ళి విషయం అనుకోలేదు' చిత్ర పెడసరంగా అంది.

'అనుకోకపోతే యిప్పుడనుకోండి. చేసుకునే ఉద్దేశం లేకపోతే జరిగింది చాలు, నలుగురి నోళ్ళలో పడింది చాలు. యివన్నీ కట్టి పెట్టింక - నిన్ను చదివించి ఉద్యోగానికి పంపడం మా తప్పయిందని మేం బాధపడే స్థితికి తీసుకురాకు' శ్రీహరి కఠినంగా అన్నాడు. చిత్ర తండ్రి చూపులనించి తప్పించుకుని 'అమ్మా, నే ఆఫీసుకు వెళ్ళాలి - ఫ్రిజ్‌లో పాలు, పెరుగు, కూరలున్నాయి. వంటింట్లో అన్నీ వున్నాయి. ఏం కావాలో చేసుకో' టవలు పట్టుకుని స్నానానికి బయలుదేరింది. 'ఈ రోజుకి శలవుపెట్టు. ఆ అబ్బాయిని రమ్మను. మనం మాట్లాడాలి' - 'ఇప్పటికిప్పుడు శలవంటే కుదరదు. సాయంత్రం మాట్లాడచ్చు' అప్పటికి తప్పించుకుంది.

ఆఫీసుకెళ్ళగానే గౌతమ్ ఫోన్ చేశాడు. 'మైగాడ్ అలా మీ వాళ్ళు హఠాత్తుగా వచ్చేసరికి గాభరా పడ్డాను. వున్నారా యింకా'

'ఆ... తలవాచేట్టుగా చివాట్లు పెట్టారు. సాయంత్రం నీ తల వాయగొట్టడానికి పిలవమన్నారు.' చిత్ర చిలిపిగా అంది. 'అలా పారిపోయావేమిటి. బట్టలేనా లేకుండా ఎలా మానేజ్ చేశావు. ఎక్కడున్నావు యిప్పుడు' అడిగింది.

'కుమార్ రూముకెళ్ళాను. వాడి బట్టలు తొడుక్కునే ఆఫీసుకెళ్ళాలి. నా బట్టలు, షేవింగ్ కిట్ అన్నీ తీసుకురావల్సింది నీవు.'

'ఎందుకంత భయం సాయంత్రం యింటికిరా. అంతా తెలిశాక భయపడ్డానికి ఏముంది? వుయ్ విల్ ఫేస్ దెమ్, ఎప్పటికయినా తప్పదుగా'

"వద్దుబాబూ, నాకు ఎంబ్రాసింగ్‌గా వుంటుంది - వాళ్ళు వెళ్ళాక ఫోన్ చెయ్యి'

"ఏయ్ డోంట్ బి స్టుపిడ్, పిరికివాడిలా పారిపోవద్దు, సాయంత్రం రా'

"చూద్దాం" ఫోను పెట్టేశాడు.

సాయంత్రం గౌతమ్ వస్తాడనుకుంది - రాలేదు. 'ఇలా మాట్లాడడానికి రమ్మంటేనే రానివాడు నిన్ను పెళ్ళాడుతాడా' అని తల్లితండ్రులిద్దరూ దుయ్యబట్టారు. యిద్దరూ కల్సి హితోపదేశాలు చేశారు. పెళ్ళి బంధంలేని ఏ స్త్రీ, పురుష బంధమూ నిలవదని ఊదరగొట్టి చెప్పారు.

'చూడు చిత్రా, మన పెద్దలు వెర్రివాళ్ళయి, ఆలోచనలేక వివాహ వ్యవస్థ ఏర్పరచలేదు. అనాది మానవుని కాలంలో వివాహ వ్యవస్థ ఏర్పడక ముందు ఒక పురుషునికి ఒక స్త్రీ అన్నది ఎందుకు ఏర్పరిచారు. పురుషులంతా తమకి నచ్చిన స్త్రీలని పీడించుకుతిని వారి అవనరాలకి వాడుకుని వదిలేయడం, ఆ స్త్రీ నిస్సహాయంగా పురుషునికి లొంగిపోవడం, వారి అవసరం తీరాక ఏ పురుషుడూ ఆమెని పట్టించుకోకపోతే తన పోషణ తనే చూసుకోవడం, గర్భం దాలిస్తే తండ్రెవరో తెలియని స్థితి. అలా పుట్టిన బిడ్డ ఎవరికీ చెందక ఆ బిడ్డ పోషణ భారం, ఆ కష్టం అంతా స్త్రీ ఒక్కతే భరించాల్సి రావడం చూసి పెద్దలంతా ఆలోచించి పశుపక్ష్యాదులు సైతం జతకట్టిందగ్గర నుంచి రెండూ కలిసి పుల్లలేరి గూడు కట్టుకుని ఆడపక్షి గుడ్లు పొదుగుతూంటే మగపక్షి ఆహారం అందించడం, పిల్లలయ్యాక ఆడ - మగ పక్షులు, జంతువులు రెండూ కల్సి పిల్లల్ని సాకి పెద్దచేసి అవి ఎగిరే వరకు కల్సి వుండి తమ బాధ్యత నెరవేర్చడం చూసి వాటి నించి పాఠం నేర్చుకుని ఒక పురుషునికి ఒక స్త్రీ సూత్రం ఏర్పరచుకుని పిల్లల బాధ్యత ఆ యిద్దరిది అన్న నిర్ణయానికి వచ్చి వుంటారు. యిద్దరూ కలసి పిల్లలని సాకడంతో ఆరంభమై కాలక్రమేణా వివాహ వ్యవస్థ ఆరంభమై వుండొచ్చు. పురుషుడు బాధ్యతాయుతంగా ప్రవర్తించడానికి వివాహ వ్యవస్థ ఏర్పడింది. ఏ పురుషుడూ వివాహ బంధంలేనిదే స్త్రీ బాధ్యత తీసుకోడు - వివాహ బంధం లేకుండా ఏ స్త్రీ పురుష బంధం ఎన్నాళ్ళో నిలవదు. అనుభవించడానికి ముందుకు వచ్చే మొగాడు నీ బరువు బాధ్యతలు అంగీకరిస్తాడా? రేపొద్దున నీకు ఏ కడుపో వస్తే తనే ఆ బిడ్డకి తండ్రినని అందరి ఎదుట అంగీకరించే బాధ్యత వహిస్తాడా! అలా తండ్రి ఎవరో తెలీని పిల్లలని ఏం అంటారో తెలుసా! బాస్టర్డ్ చిల్డ్రన్! చిత్రా సమాజంలో బతుకుతున్నప్పుడు సమాజానికి కొన్ని కట్టుబాట్లుంటాయి. అవి అతిక్రమిస్తే ఏ సభ్య సమాజమూ వూరుకోదు. మా యిష్టం అనడానికిది అడవికాదు - చిత్రా అతను నీకిష్టమయితే పెళ్ళి చేసుకో. మాకేం అభ్యంతరం లేదు. నీకు నచ్చినవాడిని చేసుకో మా అంగీకారం వుంటుంది. అంతేకానీ యిలా విచ్చలవిడితనం ఎవరూ అంగీకరించరు. బిఫోర్ యిటీజ్ టూ లేట్ - త్వరగా ఓ నిర్ణయానికి రా' శ్రీహరి చాలా శాంతంగానే చెప్పదలచింది గట్టిగా చెప్పాడు.

'చిత్రా - నీవు చేసిన యీ పనితో యింక మేం నీకు సంబంధాలు చూసే స్థితి లేదు. - ఏ తల్లి తండ్రి పెళ్ళికాక ముందు కాపురాలు వెలిగించిన పిల్లని కోడలుగా యిష్టపడరు. యింక ఎవరిని చేసుకున్నా నీవే చేసుకోవాలి. యీ మగాళ్ళ సంగతి నీకు పూర్తిగా తెలియదు. లివింగ్ టుగెదర్లకి అభ్యంతరాలుండవు - అదే పెళ్ళి చేసుకుందాం అనేసరికి అమ్మ, నాన్న, సాంప్రదాయం గుర్తు వస్తాయి. యీ కల్సి వుండడాలు ఎన్నాళ్ళు - మోజు తీరగానే నిన్నెలా వదుల్చుకుందామనే చూస్తాడు మగాడు - నూటికో కోటికో ఓ మంచివాడుండచ్చు. నిన్ను నిజంగానే ప్రేమించిన వాడు దొరికితే అదృష్టవంతురాలివే! ఈ గౌతమ్‌ని నీవిష్టపడ్డావు కనక అతనితో పెళ్ళి ప్రస్తావన తీసుకురా. ఏమంటాడో విని గ్రహించుకో. యింకా ఆలస్యం చేయకు. సావిత్రి హితవు చెప్పింది. వాళ్ళిద్దరి మాటల్లో కొంత నిజం వుందన్నది మొదటిసారి గుర్తించింది చిత్ర.

✦✧✦

తల్లి తండ్రి వెళ్ళాక యింటికొచ్చిన గౌతమ్‌తో 'అమ్మనాన్న దుమ్ము దులిపి వెళ్ళారు యిలా యిద్దరం వున్నందుకు, నీవొస్తే నీతో పెళ్ళి గురించి మాట్లాడాలనుకున్నారు. నీవెందుకు రాలేదు.'

'అందుకే రాలేదు. యీ పెద్దవాళ్ళెపుడూ పెళ్ళి అన్నమాట తప్ప మరోటి మాట్లాడరు. అపుడే పెళ్ళేమిటి యింకా పూర్తిగా సెటిల్ కాకుండా - ఏణ్ణర్థం అయింది ఉద్యోగంలో చేరి, యింకా పాతికేళ్ళన్నా నిండలేదు - నాలుగు డబ్బులు వెనకేసుకోవాలి, ఓ ఫ్లాట్, ఓ కారు ఏమీ లేకుండా యిప్పటినించి పెళ్ళేమిటి?' చాలా తేలిగ్గా కొట్టిపారేశాడు. చిత్ర మొహం కాస్త చిన్నపోయింది. పోనీ యిపుడుకాదు, యింకో రెండేళ్ళాగి చేసుకుందాం మనం అని అనకూడదా, మీ వాళ్ళకు చెప్పు, కొన్నాళ్ళు ఆగి చేసుకుంటాం' అన్న భరోసా యివ్వకూడదా...? గుప్పెడంత గుండె యింకా ముడుచుకుంది. తల్లితండ్రి చెప్పినట్లు లివింగ్ టు గెదర్ మీద చూపిన ఉత్సాహం పెళ్ళి పేరెత్తేసరికి తగ్గిపోతుందా మగాళ్ళకి? చిత్ర మొహం ముడుచుకోవడం చూసి 'ఏయ్ ఏమిటలా చూస్తున్నావు? అమ్మాయిగారికి పెళ్ళిమీదకి పోయిందా మనసు, అమ్మ, నాన్న చేసిన బ్రెయిన్ వాష్ పనిచేస్తున్నట్టుంది' జోకింగ్‌గా అన్నాడు. 'అమ్మ, నాన్న అన్నారని కాదు - మన గురించి చుట్టూ ఏం అనుకుంటారో వింటే... యీ సెక్రటరీ గాడున్నాడే వాడే మామయ్యకి అంతా చెప్పాడు... సంసారులుండే యిళ్ళు, యిలాంటివి సహించం, యింటి ఓనర్‌కి చెప్పి ఖాళీ చేయిస్తాం అంటూ ఎగిరాడుట.' 'ఆ రాస్కెల్ పనా యిది, వుండు వాడి పని పడ్తా' ఆవేశంగా లేచాడు.

'చాల్లే, వాడితో గొడవ పడితే మనకే నష్టం - అమ్మ, నాన్న గట్టిగా చెప్పారు. ఆర్నెల్లనించి కల్సి వున్నారు, ఒకరంటే ఒకరికి అర్థం అయింది. యిద్దరూ ఉద్యోగాలు చేస్తున్నారు, యింకా ఆలస్యం వద్దు అన్నారు.' గౌతం విసుగ్గా చూశాడు.

'అబ్బ, ఎంత చదివినా, ఉద్యోగాలు చేసినా మీ ఆడవాళ్ళకి ఎప్పుడూ పెళ్ళిగోలే. పెళ్ళయితే తప్ప లైఫ్‌కి సెక్యూరిటీ లేదనుకునే సగటు ఆడదానికి, నీకు తేడా ఏముంది?' హేళనగా అన్నాడు. చిత్ర మొహం ముడుచుకుంది. యింకేం అనాలో తెలియక. 'సరేలే ఆలోచిద్దాం - యిపుడే అంటే కుదరదు. పెళ్ళికేముంది ఎప్పుడంటే అప్పుడే చేసుకోవచ్చు' సర్దిచెపుతున్నట్లన్నాడు.

✦✧✦

గౌతమ్ యీ మధ్య మారాడని అనిపిస్తూంది చిత్రకి - ఆ ప్రేమ మైకం, ఉధృతం తగ్గింది - నిద్ర సరిపోక, ఆఫీసులో పని సాగకపోవడంతో వీక్ ఎండ్స్‌ని పరిమితం చేసుకున్నారు. శృంగారానికి - ఆఫీసులో పనెక్కువై వంట చెయ్యాలంటే బద్ధకం అనిపిస్తూంది. వంట చేయడం తన డ్యూటీ అన్నట్టు గౌతమ్ వంటింటి వైపు రాకుండా దర్జాగా పేపరో, పుస్తకమో చదువుకుంటూ కూర్చోడం చూస్తే చిత్రకి వళ్ళు మండుకొస్తుంది. పైగా వంటకి వంకలు... కట్టుకున్న పెళ్ళాం మీద ఎగిరినట్టు బట్టలుతికినవి, యిస్త్రీవి లేకపోతే విసుక్కోవడం, విని విని ఓ రోజు చిత్ర 'ఏమిటలా మొగుడిలా అథారిటీ చేస్తున్నావు, నీ బట్టలు నేను రెడీ చెయ్యాలా? యిస్త్రీ పెట్టక్కడ వుంది చేసుకో' అంది అరుస్తూ. గౌతం మొహం

ముడుచుకుని విసురుగా యిస్త్రీ చేసుకుని బట్టలు వేసుకుని టిఫిను తినకుండా వెళ్ళిపోయాడు. రెండు రోజులు మాట్లాడకుండా అలిగిన అతన్ని మళ్ళీ చిత్ర ప్రసన్నం చేసుకోవాల్సి వచ్చింది. యింకోరోజు సాయంత్రం ఆఫీసు నించి వస్తూనే తలనొప్పితో పడుకుంది – వంట చెయ్యలేదు – గౌతమ్ వస్తూనే ఆకలి అంటూ వచ్చాడు ఎనిమిది గంటలకి – చిత్ర చిరాగ్గా 'వంట చెయ్యలేదు' నాకు బాగులేదు, నీవు చెయ్యి, కుక్కరు పడేసి ఫ్రిజ్‌లో నిన్న కూర, పచ్చడి వున్నాయి వేడి చెయ్యి అంది. 'నాకాకలేస్తూంది. యిప్పుడు నే చెయ్యాలా,' చాలా చిరాగ్గా మొహం పెట్టి, ఏదో హోటల్‌కి పోయి తింటా వంట నా వల్లగాదు' అంటూ విసురుగా వెళ్ళిపోయాడు. చిత్ర మనసు చివుక్కుమంది. తనేం తింటుంది అనికూడా అడగకుండా, తనని రమ్మనకుండా అలా వంటరిగా వెళ్ళిపోయాడని ఉక్రోషం వచ్చింది. ఓ గంటన్నర తర్వాత చేతిలో దోశ పొట్లాం పట్టుకుని వచ్చాడు. 'ఇదిగో నీకోసం దోశ తెచ్చాను' అన్నాడు. చిత్ర చురచుర చూసింది. తనక్కడ శుభ్రంగా కావల్సినవి తిని వచ్చాడు – పోనీ తనూ యింటికి తెచ్చుకుంటే యిద్దరూ కల్సి తినేవారుగా – ఆ మాట పైకి అనకుండా వుండలేకపోయింది. ఆకలి చల్లారిన గౌతమ్ తేలిగ్గా నవ్వేస్తూ 'దోశ చల్లారిపోతే బాగుండదని తినేసి నీకు తెచ్చాను, దానికే యింత కోపమా' అన్నాడు.

చిన్న తగవులు, అలకలు ఎక్కువయ్యాయి – ఒకరి నొకరు ఆకర్షించుకోవాలి, యింప్రెస్ చెయ్యాలన్న ఆరాటం తగ్గింది. పెళ్ళయిన కొత్త జంట పాతబడి సంసారం సాగిస్తున్న దంపతులలా తయారయింది – గౌతమ్ విసుక్కున్నా, కోప్పడ్డా కట్టుకున్న పెళ్ళాం ననుకుంటున్నాడు అనిపించేది చిత్రకి – చిత్ర దెబ్బలాట పెట్టుకుని అలిగితే 'యావిడ అలకలు తీర్చడానికి కట్టుకున్న మొగుడినా' అనిపిస్తూంది గౌతమ్‌కి – ఒకరిలో మరొకరికి లొసుగు లెక్కువ కనిపిస్తున్నాయి. మైనస్ పాయింట్లు, వీక్ పాయింట్లు బయటపడుతున్నాయి – కాని ఇద్దరికిద్దరూ బయటపడకుండా, 'ఇదేనా నీ ప్రేమ' అని రెండో వారు నెపం వేసే అవకాశం యివ్వకుండా గుంభనంగా వున్నారు.

ఆరోజు గౌతమ్ ఆఫీసుకి అతని తండ్రికి హార్ట్ అటాక్ వచ్చిందని ఫోనురాగానే బయలుదేరి వెళ్ళాడు.

ఈరోజు తీరిగ్గా వెనక్కి తిరిగి చూసుకుంటూంది చిత్ర – యిద్దరి సహచర్యం ఆరంభమయి ఏడాది దాటింది. యింకా సాగదీయకుండా గౌతమ్‌ని ఖచ్చితంగా పెళ్ళి గురించి అడగాలి. తల్లి తండ్రి ఆదివారం ఫోనులో అరగంట యిదే విషయంపై వత్తిడి తెస్తున్నారు. వాళ్ళడిగారనే కాక తనకీ ఈ మధ్య గౌతమ్ వ్యవహారం తేల్చుకోవాలనిపిస్తూంది. చిత్ర అతను రాగానే మాట్లాడాలని నిర్ణయించుకుంది.

✦✧✦

గౌతమ్ రావడమే చిరాగ్గా వచ్చాడు 'ఎలా వుంది మీ డాడీకి' చిత్ర అతని చేతిలో షోల్డర్ బ్యాగు అందుకుంటూ అడిగింది. 'హార్ట్ ఎటాక్ లేదు ఏం లేదు. సేమ్ ఓల్డ్ స్టోరీ – మన సంగతి తెలిసి తిట్టడానికి పిలిచారు. నీవసలు మా నాన్న గారి అడ్రసు మీ వాళ్ళకి ఎందుకు చెప్పావు?' చిత్ర మీద ఎగిరాడు.

'నేనేం అడ్రసు యివ్వలేదు. మీ నాన్నగారెవరు ఎక్కడ పనిచేస్తారు అని కాజువల్‌గా అడిగితే పూనాలో మీ నాన్నగారు పనిచేసే కంపెనీ పేరు చెప్పాను.'

'యింకేం ఆ కంపెనీలో టాప్ పొజిషన్‌లో వున్న ఆయనని పట్టుకోడం ఏం కష్టం – ఫోన్ చేసి మన సంగతి చెప్పి, మీ అబ్బాయికి మా అమ్మాయికి పెళ్ళి జరిపించాలి త్వరలో' అన్నారుట. సోఫాలో కూర్చుని షూ లేస్ విప్పుకుంటూ అన్నాడు. 'పోనీ చేసేసుకుందామా, యిటు అటు అంతా గొడవ గొడవ చేస్తున్నారు, వెనక నించి అతని భుజాల చుట్టూ చెయ్యివేసి తలకి తల ఆన్చి గోముగా అంది. గౌతమ్ చిరాగ్గా చేయి తీసేసి 'స్టుపిడ్, చేసుకోమంది నిన్నుకాదు, వాళ్ళు చూపించిన మా మహారాష్ట్ర అమ్మాయిని' అన్నాడు. చిత్ర మొహం కళ తప్పింది. 'నీవేమన్నావు?' సూటిగా చూసి అడిగింది. గౌతమ్ చూపు తప్పించాడు. 'ఏమంటాను, నామాట అసలు వాళ్ళు వినిపించుకుంటేనా? వాళ్ళు ఖచ్చితంగా చెప్పేశారు. పెళ్ళి కాకుండా కాపురాలు చేసే పిల్లని చచ్చినా కోడలిగా అంగీకరించమన్నారు. పెళ్ళికి చూడాల్సింది, నచ్చాల్సింది అందాలు ఒకటేగాదు, అబ్బాయి, అమ్మాయిలే కాదు, సాంప్రదాయాలు యిటు అటు కుటుంబాలు చూడాలిట – పెళ్ళి కాకుండా మొగపిల్లలతో కాపురం వెలగబెట్టే అమ్మాయి పెళ్ళి తర్వాత సవ్యంగా కాపురం చెయ్యదుట."

చిత్ర నల్లబడిన మొహంతో కింద పెదవి కొరుకుతూ 'మరి నీవు చెప్పలేదా, మనం ప్రేమించుకుంటున్నామని, పెళ్ళిచేసుకుంటామని"

"నే చెప్పకముందే వాళ్ళకి తెల్సిందిగా." ఆ అమ్మాయిని నిజంగా నీవిష్టపడితే ముందే చెప్పాల్సింది. ఆ అమ్మాయి యిలా నీతో కాపురం వెలిగించే ముందే నిన్ను పెళ్ళిచేసుకోమని అడిగి వుంటే అలాంటి అమ్మాయిని కోడలిగా అంగీకరించడానికి మాకేం అభ్యంతరం వుండేది కాదు. ఆడపిల్ల అంత తెగించి, బరితెగింపుగా పెళ్ళి ప్రసక్తి లేకుండా నీతో ఏడాదిగా వుందంటే ఆ అమ్మాయి కారక్టర్ ఎలాంటిదో తెలుస్తూంది. అలాంటి పిల్లనా నీవు చేసుకునేది' అని దులిపి పారేశారు."

చిత్ర మొహం మరింత నల్లబడింది. 'అలా అంటుంటే వింటూ వూరుకున్నావన్నమాట?' ఉక్రోషంగా అంది. "ఏం చెయ్యను, అసలు వాళ్ళు నాకు మాట్లాడే అవకాశం యివ్వలేదు. వాళ్ళకి సాంప్రదాయం, కుటుంబం ముఖ్యం అట – అలాంటి మంచిపిల్లని వాళ్ళు చూసి వచ్చారుట. మహారాష్ట్ర బ్రాహ్మణ అమ్మాయినే చేసుకోవాలన్నారు. తల్లితండ్రి కావాలంటే ఆ అమ్మాయిని చేసుకోవాలన్నారు. అలా మాట వినకపోతే వాళ్ళకి నాకు సంబంధం వుండదు. ఆస్తి మొత్తం అనాధ శరణాలయానికి రాసి పారేస్తాం అని బెదిరించారు'.

చిత్ర చిత్రంగా చూసింది. 'ఆ బెదిరింపులకి లొంగిపోతావా, ఆర్ ఆల్‌రెడీ లొంగిపోయావా' గౌతమ్ మొహంలో హావభావాలు వెతుకుతూ అంది. గౌతమ్ తలదించుకున్నాడు. ''చిత్రా, మనం ఎంత ప్రేమించుకున్నా తల్లిదండ్రులని కాదని పెళ్ళి చేసుకుంటే భవిష్యత్తులో సుఖంగా వుండగలమా? నేనొక్కడినే మా వాళ్ళకి – మా అమ్మ ఎంత ఏడ్చిందో, అలా వాళ్ళని బాధపెట్టి మనం హాయిగా వుండగలమా అన్పించింది ఆలోచిస్తే"– చిత్రకి కోపం నసాళానికి అంటింది. "అవును పాపం, తల్లితండ్రి నీకే వున్నారు. అయినా ఓ ఆడపిల్ల కోసం కోటి రూపాయల ఆస్తి వదులుకుంటారా మీ మగవాళ్ళు. ఆ మరాఠీ అమ్మాయి నా కంటే బాగున్నట్టుంది. అంచేత నీకు తల్లి దండ్రి మీద భక్తి ఎక్కువైపోయింది పాపం" వ్యంగ్యంగా అంది. గౌతమ్ కళ్ళు వాల్చుకున్నాడు. చిత్ర అతని మొహంలో భావాలు వెదుకుతూ రెండు నిమిషాలు చూసి అతను మాట్లాడకపోవడం చూసి గిరుక్కున తిరిగి బెడ్‌రూమ్‌లోకి వెళ్ళి అతని బట్టలు, సామాన్లు సూట్‌కేసులో, షోల్డర్ బ్యాగులో పడేసి తీసుకొచ్చి వీధి తలుపుతీసి బయట పడేసి ఇంక వెళ్ళచ్చు అన్నట్టు మండుతున్న కళ్ళతో నడుం మీద చేతులు పెట్టుకు నిల్చుంది. గౌతమ్ నల్లబడ్డ మొహంతో ఏదో చెప్పబోతే చేత్తో వారించింది. యిప్పటికే తన ప్రేమ, ఎమోషన్స్, శక్తి, డబ్బు అన్నీ చాలా ఖర్చు పెట్టింది. ఇంకొక మాట కూడా మాట్లాడి తన ఎనర్జీ, ఎమోషన్స్, ప్రేమని వృధాపరచదలచుకోలేదు చిత్ర.

✿

# ఉగాది

చైత్రానికి చైతన్యం వచ్చిందని
ఋతువులన్నీ ఏకమై
వసంతానికి పట్టం గడుతున్నాయి.
ఎండిన మోళ్ళు చిగుళ్ళు తొడిగి
గర్వంగా సిరులు పైకెత్తి స్వాగతమిస్తుంటే
ఉషస్సులో ఉగాది – నవ వధువులా
అడుగుపెడుతుంటే
గున్న మావి చిగుళ్లు గొంతునిండా మెక్కి
మత్తకోకిల కొత్త రాగం పాడింది.
ఆమని అరుదెంచే వేళ
యుగయుగాల ఉగాది – మరచిపోని బాల్యంలా
చిగురించే తొలి యవ్వనంలా–
అనుభవాల వార్ధక్యాన్ని గుర్తు చేసుకుంటూ
రాకెట్టులా పరుగెత్తుతున్న కాలంతో పోటీపడి
రాలిపోయిన పండుటాకుల అనుభవాలు
నెమరువేసుకుంటూ
గతంలో జరిగిన చేదు అనుభవాలు మరచిపోయి
మనసు పొరల్లో దాగిన మధుర క్షణాలు
పండుగ నాడు పదిలంగా దాచుకొమ్మంటున్నది.
కాలం చేసిన గాయాలకు రేపటి ఆశలే ఔషధాలై
పగుళ్ల బారిన గుండె చప్పుళ్లను కోయిలమ్మ
ఊరడిస్తుంది.
కరిగిపోయే కాలమా... అంతులేదు నీ పయనానికి.
ఓటమి గెలుపుల పోరాటంలో– చీకటి వెలుగుల
చెలగాటంతో
మండుటెండల్లో– మల్లెల సిరి పంటల్లో
రాగద్వేషాలను మరచిపోయి
రాతి గుండెల్లో శాంతి సుమాలు పూయించాలి.
ఆరు రుచుల ఉగాది పచ్చడి ఆరగించి
ఆనందంగా పంచాంగంలో అదృష్ట ఫలాన్ని చూసి
ఆశపడబోకు... కష్టానికి ప్రతిఫలం ఆశించడమే నీ
కర్తవ్యం.
నిన్నటి గాయాన్ని చూసుకుని గతం గగనంలా
రోదించింది.
నేటి కొత్త గేయం పాడుకుంటూ
నూతన సిరి చిరునవ్వుతో శోభిస్తున్నది.

– టి. పద్మావతి